Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 338 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 20 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## జ్యోతిని పావుగా వాడుకున్న పాక్! కొత్త తరహా యుద్ధంతో..




**న్యూఢిల్లీ :** పహల్గాం దాడి దరిమిలా ఉగ్రవాదులను ఏరివేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా గాలింపులు చేపడుతోంది. ఇందులో భాగంగా టెర్రరిస్టులకు సహకరిస్తున్న వారిని గుర్తించడం మీద నిఘా వర్గాలు ఫోకస్ చేశాయి. గూఢచర్యం చేస్తూ మన ఆర్మీ రహస్యాలను శత్రుదేశానికి చేరవేస్తున్న దేశద్రోహుల కోసం వేటాడుతున్నాయి. ఇప్పటికే గూఢచర్యం చేస్తున్న పలువుర్ని అదుపులోకి తీసుకున్నారు అధికారులు. వారిలో జ్యోతి మల్హోత్రా ఉదంతం సంచలనంగా మారింది. ఆమె కేసులో ఒక్కొక్కటిగా నమ్మలేని విషయాలు బయటకు వస్తున్నాయి. పహల్గాం దాడికి కొన్ని నెలల ముందు ఆ ప్రాంతానికి ఆమె వెళ్లడం, పాక్ ఐఎస్ఐతో సంబంధాలున్న ఆ దేశ రాయబార కార్యాలయ ఉద్యోగి డానిష్‌తో జ్యోతికి సన్నిహిత సంబంధం ఉందనే విషయాలు సంచలనంగా మారాయి. ఈ తరుణంలోనే జ్యోతిని పాక్ పావుగా వాడుకుందనే మరో విషయం బయటకు వచ్చింది.

**ఆయుధంలా వాడాలని..**

కొత్త తరహా యుద్ధం కోసం జ్యోతి మల్హోత్రాను పాకిస్థాన్ ఆయుధంగా వాడుకుందని తెలిస్తోంది. భారత్‌తో సమాచార యుద్ధం (ఇన్‌ఫర్‌మేషన్ వార్‌ఫేర్)లో జ్యోతిని కీలక ఆయుధంగా మలచుకోవాలని, సమయాన్ని బట్టి వాడుకోవాలని పాక్ అనుకుందట. ఇందులో భాగంగానే ఆమెతో పాకిస్థాన్‌కు అనుకూలంగా ప్రచారం చేయించారని సమాచారం. ఇన్‌ఫర్‌మేషన్ వార్‌ఫేర్‌లో భాగంగా ఒకవైపు పాక్ అనుకూలిత ప్రచారం చేయించడంతో పాటు మరోవైపు భారత్‌పై విద్వేషం పెరిగేలా చేయడంలోనూ జ్యోతిని వాడుకోవాలని డిసైడ్ అయ్యారని వినిపిస్తోంది.

**కూపీ లాగుతున్నారు!**

పాకిస్థాన్ అనుకూల ప్రచారాలను పక్కనబెడితే.. భారత మిలటరీకి సంబంధించిన రహస్య సమాచారాన్ని శత్రుదేశానికి పంపారా? అనే కోణంలో జ్యోతిని విచారిస్తున్నారట పోలీసులు. జ్యోతితోపాటు పాక్‌ను సందర్శించిన ఆమె స్నేహితులు, ఇతర ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్లనూ అధికారులు ఇన్వెస్టిగేట్ చేస్తున్నారట. కాగా, 2023, 2024తోపాటు 2025లోనూ పాక్‌కు జ్యోతి వెళ్లినట్లు బయటపడింది. పహల్గాం ఉగ్రదాడికి ముందు మార్చి నెలలో శత్రుదేశాన్ని ఆమె సందర్శించిందని తెలిసింది.

## సీఎం చంద్రబాబుకు బిల్‌గేట్స్ లేఖ.. అసలు కారణమిదే




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవను అభినందిస్తూ గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ ఇవాళ (సోమవారం) లేఖ రాశారు. ఢిల్లీలో గేట్స్ ఫౌండేషన్ బృందంతో జరిగిన ఒప్పందం, సమావేశాన్ని ప్రస్తావిస్తూ సీఎం చంద్రబాబుపై బిల్ గేట్స్ ప్రశంసలు కురిపించారు. మీరు మీ బృందంతో ఢిల్లీ వచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. మంచి వాతావరణంలో సంప్రదింపులు జరిపామని బిల్ గేట్స్ ప్రస్తావించారు. పేదలు-అట్టడుగు వర్గాల విద్య, ఆరోగ్యంలోనూ... వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధిపైనా గేట్స్ ఫౌండేషన్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఆరోగ్యరంగాన్ని పటిష్ట పరచడం, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్, ఏఐ అసిస్టెడ్ క్లినికల్ డెసిషన్ మేకింగ్, మెడ్‌టెక్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దడం, వ్యవసాయంలో నాణ్యమైన విత్తనాల తయారీ, సాయిల్ హెల్త్ మానిటరింగ్, తల్లీబిడ్డల ఆరోగ్యానికి మైక్రోన్యూట్రీయంట్లు అందించే అంశాలపై ఇరువురం చర్చించామని గుర్తుచేశారు.

**చంద్రబాబు పనితీరుకు నిదర్శనం..**

'పాలనలో టెక్నాలజీ, ఇన్నోవేషన్‌ను బలోపేతం చేసేందుకు, మెరుగైన సేవలు అందించేందుకు మీరు చూపిన ఆసక్తి మీ చిత్తశుద్ధికి, విజన్‌కు నిదర్శనం. మీరు ఆశించే ఏఐ డ్రివెన్ డిసిషన్ మేకింగ్, రియల్ టైమ్ డేటా సిస్టమ్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ వంటివి మీ నాయకత్వ ప్రతిభను ప్రస్ఫుటం చేస్తున్నాయి. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో... ప్రభుత్వ సేవల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మీరు చేస్తున్న కృషి ఆంధ్రప్రదేశ్‌కే కాదు భారత్ సహా, అల్పాదాయ దేశాలకు ఉపయోగపడుతుంది. ఈసారి నా భారతదేశ పర్యటనలో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేనాటికి... మీ నాయకత్వం-మన భాగస్వామ్యంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో అద్భుతమైన పురోగతి సాధించగలమని చెప్పగలను గేట్స్ ఫౌండేషన్-ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యం మున్ముందు కొనసాగాలని, కలిసికట్టుగా పనిచేసి రాష్ట్ర భవిష్యత్‌పై సానుకూల ప్రభావాన్ని చూపాలని ఆశిస్తున్నాను' అని లేఖలో బిల్ గేట్స్ ప్రస్తావించారు.


## డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా.. లోకేశ్ సీరియస్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో తమకు కావాల్సినంత సంఖ్య బలం ఉందని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జీవీఎంసీలో డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడింది. ఈ నేపథ్యంలో సోమవారం విశాఖపట్నంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నిన్నటి వరకు.. డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం కావడానికి ఒక కారణం ఉందన్నారు. గత రాత్రి 11.00 గంటలకు ఆ పదవి జనసేన పార్టీకి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే ఆ పదవి కోసం టీడీపీలో ఆశావాహులున్న మాట వాస్తవమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇక ఈ ఎన్నిక వాయిదా పడడానికి కోఆర్డినేషన్ సమస్య కూడా ఒక కారణమన్నారు. అందుకే ఈ ఇబ్బంది వచ్చిందని ఆయన తెలిపారు. జీవీఎంసీ కౌన్సిల్‌కు సభ్యులంతా వస్తారని తాము ధీమాతో ఉన్నామన్నారు. దీనికి తాను పూర్తి బాధ్యత వహిస్తానని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మరోవైపు.. విశాఖపట్నంలో నేడు జరగాల్సిన డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడడం.. అందుకు పార్టీ కార్పొరేటర్లు గైర్హాజరు కారణం కావడంపై తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. ఈ ఎన్నికకు గైర్హాజరైన వారికి నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర నాయకత్వానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశించారు. కొందరిపై



చర్యలకు వెనకాడవద్దని ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి ఆయన కీలక సూచన చేశారు. మరోసారి ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విశాఖపట్నం డిప్యూటీ మేయర్ ఎన్నిక ఈ రోజు జరగాల్సి ఉంది. కానీ కౌన్సిల్‌లో సభ్యులు మొత్తం 74 మంది ఉంటే.. 54 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ డిప్యూటీ మేయర్ ఎన్నికకు 56 మంది సభ్యులు అవసరమవుతారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికను మంగళవారం నిర్వహించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇంకోవైపు ఈ డిప్యూటీ మేయర్ ఎన్నికకు కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

## ఆ నలుగురిని కస్టడీకి ఇవ్వండి.. సిట్ పిటిషన్




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితులు నలుగురిని కస్టడీకి ఇవ్వాలని విజయవాడ కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డి, ఈ కేసులో ఏ1గా ఉన్న కశిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్‌గా ఉన్న బాలాజీ గోవిందప్పలను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోరారు. వీరు నలుగురిని కలిపి విచారించాల్సిన అవసరం ఉందని సిట్ బృందం పేర్కొంది. మద్యం ముడుపులు, కమిషన్ వ్యవహారంలో ఈ నలుగురికి తెలిసి కొన్ని విషయాలు జరిగాయని.. అందువల్లే నలుగురిని కలిపి విచారించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అప్పుడు మాత్రమే ఈ కేసు తదనంతర దర్యాప్తుకు అవకాశం ఉంటుందని తెలిపింది. సిట్ పిటిషన్‌పై రేపు (మంగళవారం) విచారణ జరిగే అవకాశం ఉంది. మరోవైపు రాజ్‌కసిరెడ్డి వాంగ్మూలం రికార్డు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విజయవాడ కోర్టులో మూడు రోజుల క్రితం పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై ఈరోజు ఏసీబీ కోర్టు విచారణకు రాగా.. కసిరెడ్డి వాంగ్మూలం రికార్డు చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని ఈడీ తరపు న్యాయవాదులు కోరారు. విచారణను ఏసీబీ కోర్టు రేపటికి (మంగళవారం) వాయిదా వేసింది. ఇదే సమయంలో నలుగురు కీలక నిందితుల కస్టడీ పిటిషన్‌పై కోర్టు రేపు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఆసక్తికరంగా మారింది. మరోవైపు లిక్కర్ స్కాం కేసులో ఏ33గా ఉన్న గోవిందప్పను వారం రోజుల పాటు కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కస్టడీ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును న్యాయస్థానం రిజర్వ్ చేసింది. అలాగే లిక్కర్ కేసులో ఏ30 పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌పై సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. దిలీప్‌కు బెయిల్ మంజూరు చేస్తే విచారణకు విఘాతం కలుగుతుందంటూ పేర్కొన్నారు. ఈ కేసులో దిలీప్ ద్వారా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మొత్తం వ్యవహారం నడిపించారని సిట్ అధికారులు తెలిపారు. పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌పై రేపు కోర్టులో విచారణ జరుగనుంది. ఇక ఈ కేసులో ఏ6గా ఉన్న సజ్జల శ్రీధర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు రేపు విచారించనుంది.

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలంగాణలో భారీ వర్షాలు




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణలో దంచికొడుతున్న ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని జిల్లాల్లో అయితే 40 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకూ ఎండల ప్రభావం ఉంది. ఎండలతోపాటు తీవ్రమైన వడగాడ్పులూ దారుణంగా ఉన్నాయి. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ అదిరిపోయే శుభవార్త చెప్పింది. రానున్న నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి, ఆవర్తన ప్రభావంతో వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. ఈ ప్రభావం తెలంగాణపైనా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రాబోయే నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఇవాళ(సోమవారం) నుంచి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఎల్లో అలర్ట్ ఉన్న జిల్లాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్‌కు వాతావరణ శాఖ పలు సూచనలు చేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్, మున్సిపాలిటీ శాఖలు ముందస్తుగా సమీక్షలు నిర్వహించుకోవాలని సూచించింది. సాధారణంగా ప్రతి ఏడాది జూన్1వ తేదీన నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయి. కానీ ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితులు విభిన్నంగా ఉండటంతో మే24వ తేదీకే కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో ఈ రుతుపవనాలు ఇప్పటికే విస్తరించాయని పేర్కొన్నారు. నైరుతి రుతుపవనాలు కేరళను మే24న తాకిన సుమారు 10 రోజుల వ్యవధిలోనే దక్షిణ భారత రాష్ట్రాలన్నింటిలోనూ రుతుపవనాలు విస్తరిస్తాయి. తెలంగాణలో జూన్ మొదటి వారంలోపే ప్రవేశించి విస్తృత వర్షాలు పడతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, నాలుగు రోజులపాటు కురిసే వర్షాలతో ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. 5 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గితే ప్రజలకు కొంతమేర ఎండల నుంచి ఉపశమనం లభించనుంది.

## హైకోర్టు న్యాయమూర్తులందరికీ సమాన పెన్షన్: సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ:** అదనపు న్యాయమూర్తులతో సహా హైకోర్టు న్యాయమూర్తులందరికీ పూర్తి స్థాయిలో సమాన పెన్షన్ అందజేయాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని సోమవారం నాడు ఆదేశించింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తులకు సంవత్సరానికి రూ.15 లక్షలు పెన్షన్ చెల్లించాలని అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు చెప్పింది. కొంతమంది హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు తక్కువ పెన్షన్ ఇస్తుండటంపై ప్రధాన న్యాయమూర్తి సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. "ఒకే ర్యాంకు ఒకే పెన్షన్'ను వర్తింపజేయాలని స్పష్టం చేసింది. ఉద్యోగంలో చేరిన తేదీ, వారు అడిషనల్ జడ్జిలుగా రిటైర్ అయ్యారా, ఆ తర్వాత పర్మనెంట్ పోస్టులు ఇచ్చారా? అనే దానితో ప్రమేయం లేకుండా జడ్జిలందరికీ పూర్తి పెన్షన్ చెల్లించాలని జస్టిస్ అగస్టిన్ జార్జి అభిప్రాయపడ్డారు. జడ్జీలు చేరిన సమయం, డిజిగ్నేషన్ ఆధారంగా వ్యత్యాసం చూపడం సమానత్వమనే ప్రాథమిక హక్కుకు విరుద్ధమని అన్నారు. శాశ్వత న్యాయమూర్తులకు ఇచ్చే పెన్షన్, రిటైర్‌మెంట్ ప్రయోజనాలనే మృతిచెందిన అదనపు హైకోర్టు న్యాయమూర్తుల కుటుంబాలకూ ఇవ్వాలని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. టెర్మినల్ ప్రయోజనాల కోసం పదవీ విరమణ తర్వాత న్యాయమూర్తుల మధ్య ఎలాంటి వివక్ష చూపినా అది ఆర్టికల్ 14న ఉల్లంఘించినట్టు అవుతుందని సీజేఐ



పేర్కొన్నారు. అన్ని హైకోర్టుల న్యాయమూర్తులకు వారు ఎప్పుడు ప్రవేశించారనే దానితో సంబంధం లేకుండా పూర్తి పెన్షన్ పొందడానికి అర్హులని చెప్పారు. బార్ నుంచి ఎలివేట్ అయిన వారికి, జిల్లా జ్యుడిషియరీకి ప్రమోట్ అయిన వారికి మధ్య వ్యత్యాసం లేదని, న్యూ పెన్షన్ స్కీమ్ కింద ప్రయోజనాలన్నింటినీ జడ్జిలకు ఇవ్వాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అడిషనల్ జడ్జీలుగా రిటైర్ అయిన హైకోర్టు జడ్జీలందరికీ పూర్తి పెన్షన్ ఇవ్వాలని పేర్కొంది. అదనపు న్యాయమూర్తులతో సహా హైకోర్టు న్యాయమూర్తులందరికీ సంవత్సరానికి రూ.13.50 లక్షలు పూర్తి పెన్షన్ ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది.

# కేంద్రంలో బీజేపీ పాలన భేష్

## - భారత దేశం సుస్థిర పాలన నరేంద్ర మోడీతోనే సాధ్యం - బీజేపీతో పొత్తు గురించి జగన్‌కు చెబుతా : మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి









**కోవూరు, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం పాలన నరేంద్ర మోడి తోనే సుస్థిరంగా ఉందని రానున్న రోజుల్లో ఈసారి ఎన్నికలలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీతో పొత్తు పెట్టుకొనే ప్రయత్నం చేసేందుకు వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి చెపుతానని మాజీ మంత్రి నల్లపరెడ్డిరాష్ట్రవైసీపీ పిఏసి సభ్యులు ప్రసన్నకుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేసారు. శనివారం ఉదయం కోవూరు పట్టణంలోని పాటూరు రోడ్డులో నూతన వైసీపీ కార్యా లయం ప్రారంభోత్సవం చేసారు. కార్యక్రమంలో వైసీపీ నాయకు లతో కలిసి ప్రసన్న పాల్గొన్నారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులలో ఆనందోత్సాహం వచ్చింది. ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ 2024 ఎన్నికలలో బీజేపీతో కలిసి వైసీపీ ఎన్నికలకు వెళ్లాల్సిందని అన్నారు. ఆ అవకాశం వైసీపీ చేతులలో ఉన్నప్పటికీ కాదని తప్పు చేశామ న్నారు. గడిచిన అయిదేళ్లలో లోకసభ రాజ్యసభ లో ఎన్డీయే బిల్లులన్నింటికి మద్దతిచ్చామని గుర్తు చేశారు. తీరా ఎన్నికలు వచ్చేసరికి దూరమైపోయామని ఆవేదన వ్యక్తం చేసారు. నారా చంద్రబాబునాయుడును మోడీ, అమిత్ షాలు నమ్మరని అంటూ మనం కాదంటేనే పవన్ కళ్యాణ్ బీజేపీ టీడీపీ లను కలిపారని చెప్పారు. నరేంద్ర మోడీలాంటి విజన్ నాయకుడు మరో 20 యేండ్లు పాటు ప్రధానిగా కొనసాగాలని ఆకాక్షించారు. రాబో యేవి జమిలి ఎన్నికలైనా సాధారణ ఎన్నికలైనా బీజేపీ తో పొత్తు పెట్టుకొని వైసీపీ ముందుకెళ్లాలని సూచించారు. ఇదే అంశంను మాజీ సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి రావు మాట్లాడుతూ గత ఏడాది టీడీపీ ప్రభుత్వ పాలనలో కావలసినంత గంజాయి పొట్లాలు, బెల్ట్ షాప్‌ల ద్వారా 24 గంటల మద్యం సరఫరా తప్ప సాధించింది ఏమి లేదని ఎద్దేవా చేశారు. కోవూరు నియోజ కవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు గాలిలో కలిసిపోయాయి అని అన్నారు. జగన్ పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.
బిబిబిబిబిబిబిబిబిట

**వీర జవాన్ మురళి నాయక్‌కు ఘన నివాళులు అర్పించిన ప్రసన్న కుమార్ రెడ్డి**

పాకిస్తాన్‌తో యుద్ధంలో అమరుడైన జవాన్ మురళి నాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రసన్నకుమార్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించి మౌనం ఘటించారు. అదేవిదంగా సీఎం హెూదాలో ఆనాడు మృతి చెందిన వై ఎస్ చిత్రపటానికి కూడా నివాళులు అర్పించారు. అదేవిధంగా పెహల్గాంలో ఉగ్ర ముష్కరుల తూటాలకు బలైపోయిన 26 మంది సామాన్య ప్రజలకు నివాళు లు అర్పించారు. దేశం కోసం ప్రాణాల్పరించిన జవాన్ల కుటుంబా లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలురెండు కలిపి 5కోట్లు రూపాయలను ఒక్కొక్క జవాన్‌కు ఇచ్చి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. వీరికి ప్రత్యేక గుర్తింపు ప్రభుత్వాలు ఇవ్వాలని కోరారు. అన్ని విధాలుగా అండగా నిలవాలని కోరారు.

**కోవూరులో అత్తిపల్లి నివాసం వద్ద వైసీపీ కార్యాలయం ప్రారంభోత్సవం**

స్థానిక పాటూరు రోడ్డులోని నూతన వైసీపీ కార్యాలయాన్ని ప్రసన్న కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో కార్యాలయం సేవలుంటాయని తెలి పారు. కార్యకర్తల కోసం న్యాయవాదులను అందుబాటులో ఉం చుతామని భరోసా ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం చేయాలన్నారు. ఈ సందర్భంగా మండల వైసీపీ కన్వీనర్ యువనేత అత్తిపల్లి అనూప్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ వైస్ ఛైర్మెన్ జయలక్ష్మి, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు పచ్చిపాల రాధాకృష్ణ రెడ్డి, జొన్నవాడ మావువలూరు శ్రీనివాసులు రెడ్డి, డి ఎల్ డీ ఏ ఛైర్మెన్ గొల్లపల్లివిజయకుమార్,కోవూరు మండలం జడ్పీటీసీ కవర గిరి శ్రీలత, వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు కవరగిరి ప్రసాద్, మాజీ డి సీ ఎం ఎస్ ఛైర్మెన్ వీరి చలపతి రావు, మైపాడు మాజీ ఎంపీటీసీ ప్రసాద్, బుచ్చి పట్టణ కన్వీనర్ షేక్ షాహుల్, కోవూరు మం డలం వైస్ ఎంపీపీ, శివుని నరసింహులు రెడ్డి, బుచ్చి కన్వినర్ చెర్లో సతీష్ రెడ్డి, కాటంరెడ్డి దినేష్ రెడ్డి, దావూద్, దళిత బాబు, విడవలూరు కన్వినర్ నవీన్ రెడ్డి, కొడవలూరు, శేషయ్య, ఇందు కూరుపేట, కోవూరు మండలం కన్వీనర్‌లు ప్రజాప్రతిని ధులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో కార్యకర్తలు తదితరులు ఉన్నారు. ఎట్టకేలకు నూతన ఒరవడితో యువ నేత కోవూరు మండలం కన్వీనర్ అత్తిపల్లి అనూప్ రెడ్డి నూతన వైసీపీ కార్యాల యం ప్రారంభ కార్యక్రమాలను సపలీకృతం చేసారు. వచ్చిన వైసీపీ నేతలందరికి మిఠాయిలను చల్లటి మజ్జిగలను అందించారు.

# ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధతలు తొలగించాలి : పి ఆర్ టి యు నేతలు



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలంలోని నడకుదురులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయ బదిలీల్లో ఉన్న అసంబద్ధతలను తొలగించాలని పి ఆర్ టి యు జిల్లా సిపిఎస్ కన్వీనర్ వాకాడ వెంకట రమణ, జిల్లా అధ్యక్షుడు ఈ.చ. ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 21న విద్యాశాఖ అనుసరిస్తున్న ఏకపక్ష నిర్ణయాలు, అసమంజస నియమాలను సవరించి, ఉపాధ్యాయ బదిలీల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరారు. న్యాయం కోరుతూ ఉద్యమిస్తున్న ఉపా ధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు పొందిన 9 ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని విద్యాశాఖ కార్యాల యాల ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఉపాధ్యాయులను ఒప్పించి కాకుండా, నొప్పించి బదిలీలు అమలు చేస్తున్న విధానాన్ని తీవ్రంగా విభేదించారు. సంఘాల డిమాండ్లను పరిగణనలోకి తీసు కోకుండా తీసుకుంటున్న చర్యలు న్యాయ వంతమైనవికావని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా కార్యదర్శి బండి సుంకరాజు, కరప మండల కార్యదర్శి పాటి వెంకటరావు, మంగరావు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం

## - స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్‌లో ఎమ్మెల్యే చినరాజప్ప



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రజల సంపూర్ణ ఆరోగ్యం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ లక్ష్యమని దానిని ప్రజలంతా అవలంబిం చాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్న రాజప్ప అన్నారు. సామర్లకోట పట్టణం బలుసులపేట ఇందిరా కాలనీలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కోవడం ద్వారా అనారోగ్యాల నుంచి బయట పడవచ్చునన్నారు. రానున్నది వర్షాకాలం అయినం దున ముందుగానే డ్రైన్లో కూడిక తీత పనులను మున్సిపల్ అధికారులు చేపట్టాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలకు పూను కోవాలన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీష్ మోహన్, వల్లూరి దొరబాబు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కాళ్ల రవీంద్ర, సానిటరీ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్త రూ.20 నోట్లు విషయంలో ఆర్‌బీఐ కీలక ప్రకటన




**న్యూ ఢిల్లీ:** కొత్త రూ.20 నోట్లు విషయంలో ఆర్‌బీఐ కీలక ప్రకటన చేసింది. కొత్త రూ.20 నోట్ల పరిమాణం 63 మిల్లీ మీటర్లు X 129 మిల్లీమీటర్లుగా ఉండనుంది. ఈ నోటుకు గ్రీనిష్ యెల్లో అనే ఆకర్షణీయమైన రంగు ప్రధానంగా ఉండబోతోంది. ఇది మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లోని ఇతర నోట్ల డిజైన్‌లకు అనుగుణంగా ఉంటుంది. కొత్త నోట్ల వెనుక భాగంలో ప్రముఖ హిస్టారికల్ స్థలమైన ఎల్లోరా గుహల చిత్రం ముద్రించ బడుతుంది. భారతదేశ సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా ఈ చిత్రం ఎంపిక చేయడం విశేషం. ఈ కొత్త నోట్లలోని ఇతర డిజైన్లు, భద్రతా లక్షణాలు, ప్యాటర్న్ మెయిన్ కలర్‌కు సరిపడేలా రూపొం దించ బడ్డాయి. ఆర్‌బీఐ ప్రకారం, ఈ మార్పులు ప్రజలకు మరింత సులభతరమైన గుర్తింపునిచ్చేలా, నోట్ల దుర్వినియోగాన్ని అడ్డుకునే లక్ష్యంతో చేపట్ట బడ్డాయి. మొత్తానికి, కొత్త రూపంలో రూ.20 నోట్లు త్వరలో ప్రజల చేతిలోకి రానున్నాయి. పాత నోట్లు కూడా చెల్లుబాటు అవుతాయని స్పష్టత రావడంతో ప్రజలకు ఏ విధమైన గందరగోళం అవసరం లేదని తెలిపారు.

# ఎమ్మెల్యేచే దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట పూజలు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ చాళుక్య కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయ ముఖ ద్వారం వద్ద శనివారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా దక్షిణామూర్తి విగ్రహాన్ని ప్రతిష్టించారు. దాత కర్రి వెంకట్రాజుతో కలసి రిబ్బను కత్తిరించి, స్వామి వారికి అభిషేకం నిర్వహించి ఎమ్మెల్యే విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణధికారి బళ్ల నీలకంఠం, మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, తెదేపా అధ్యక్ష, కార్యదర్శి అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు, నాయకులు వల్లూరి దొరబాబు, పడాల వీరబాబు, వంశీ, భక్త నాయకులు బిక్కిన సాయి, ఆలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.





# కూటమి ప్రభుత్వంలో కర్నూలు జిల్లా అభివృద్ధి : భరత్

**కర్నూలు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో, కర్నూలు జిల్లాలో కూటమి ప్రభుత్వంలోనే శర వేగంగా అభివృద్ధి చెందు తుందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు సార్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధిలో సుస్థిరం చెందుతుందని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కర్నూలు నియోజకవర్గంలోని ఓ హెూట ల్‌లో ఆదివారం మినీ మహా నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్, ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, కార్పొరేటర్లు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఓర్పు అవసరమని అన్నారు. 2019 ఎన్నికల ముందు ఓ నాయకుడిని మంత్రి నారా లోకేష్ అభ్యర్థిగా ప్రకటించా రని, అయినప్పటికీ ఓర్పుగా ఉన్నానని, చివరకు తనకే టికెట్ వచ్చిందని మంత్రి టీజీ భరత్ గుర్తు చేశారు. రానున్న కార్పొరే షన్ ఎన్నికల్లో 33 వార్డులను టీడీపీ కైవసం చేసుకోవాలని మంత్రి టీజీ భరత్ ధీమా వ్యక్తం చేశారు. కష్టపడే వారికే కార్పొరేటర్ టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. తన పని తీరును మెచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశ్రమల మంత్రి పదవి ఇచ్చారని మంత్రి టీజీ భరత్ గుర్తు చేశారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో 33 వార్డులను టీడీపీ కైవసం చేసుకోవాలని మంత్రి టీజీ భరత్ ఆశాభావం వ్యక్తం చేశారు. కష్టపడే వారికే కార్పొరే టర్ టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. తన పని తీరును మెచ్చి ముఖ్యమంత్రి చంద్ర బాబు పరిశ్రమల మంత్రి పదవి ఇచ్చారని గుర్తు చేశారు. మాది పొలిటికల్ గవర్నెన్స్ అని తెలి పారు. రైతు బజార్ విస్తరణకు, అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.6 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఓర్వకల్లులో రూ.1,000 కోట్లతో సెమీ కండక్టర్, మరో రూ.1,000 కోట్లతో ఈవీ వెహికిల్ పరిశ్ర మలు ఏర్పాటు చేయబోతున్నా మని ప్రకటించారు. గతంలో ఓర్వకల్లులో భూములు తీసు కుని పరిశ్రమలు ఏర్పాటు చేయని వారికి నోటీసులు ఇచ్చామన్నారు. అనంతపురం నుంచి ఓర్వకల్లు వరకూ పారి శ్రామిక వాడ ఏర్పాటు చేయా లని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. కర్నూలులో ఉన్న బీసీ భవన్ పిల్లర్ల దశలోనే ఆగిపోయిందని చెప్పారు. కోటి రూపాయలతో పనులు పున: ప్రారంభం చేస్తామని మంత్రి టీజీ భరత్ వెల్లడించారు.

# ఘనంగా ముగిసిన చిల్డ్రన్ బైబిల్ తరగతులు...ఆకట్టుకున్న పప్పెట్ షో




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట ఆంధ్ర జూబిలీ బాప్టిస్ట్ చర్చిలో వేసవి సెలవుల్లో నిర్వహించే చిల్డ్రన్ బైబిల్ తరగతులు శనివారం ఘనంగా ముగిసాయి. సత్తి యువజన సంఘం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన తరగతుల ముగింపు కార్యక్రమం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హుషారుగా జరిగింది. కార్యక్రమంలో పిఠాపురం ఏలూరు ప్రాంతాలకు చెందిన ఒక ప్రత్యేక టీం సభ్యులు విచ్చేసి పాల్గొని పప్పెట్ షోలు, మ్యాజిక్ షోలు, పలు పోటీలు నిర్వహించారు. ఇంకా గత వారం రోజులుగా నిర్వహించిన తరగతుల్లో పిల్లలు నేర్చుకున్న అంశాలపై పరీక్షలు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కాగా తరగతుల్లో నిర్వహించిన పప్పెట్ షో చిన్నారులని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సంఘ యువజన సమాజ నాయ కులు టి అమర్ కళ్యాణ్, టి అమర్ కిరణ్, ఆర్ నవీన్ (సిద్దు), డి ప్రిన్స్, జె సురేంద్ర, విన్స్, పి మెల్విన్, బి వర్షిణి ప్రియ, టి మాలతి, టి వాణి, దయా ప్రకాషిణి, కుమారి (మెర్సీ), బి కష్యప్, బి అరుణ కిరణ్ కుమారి, సంఘ కాపరి రెవ. డా.బి కిరణ్ కుమార్, పప్పేట్ షో టీమ్ సభ్యులు ఎం అనీల్ కుమార్, ప్రకాష్, లలిత, ప్రేమ్, జాన్ ఆసిస్, సంఘ అధ్యక్షులు బి ఎస్ వందనం, కార్యదర్శి టి సూర్యారావు, ఐఈ జీవన్ కుమార్, డేవిడ్ రాజు, బి జాన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# డ్యాన్స్‌తో కేక పుట్టించిన తమన్నా.. నెట్టింట వీడియో వైరల్





స్టార్ హీరోయిన్, మిల్కీ బ్యూటీ తమన్నా కెరీర్‌లో దూసుకుపోతున్నారనే చెప్పాలి. భాషతో సంబంధం లేకుండా బాలీవుడ్, టాలీవుడ్ సహా ఇతర సినీ ఇండస్ట్రీల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్‌గా ఓదెల-2 మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అమ్మడు... తన యాక్టింగ్‌తో మెప్పించారు. ఇప్పుడు పలు సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. అదే సమయంలో హీరోయిన్‌గా నటిస్తూనే.. అడపాదడపా స్పెషల్ సాంగ్స్‌లో తళుక్కున మెరుస్తున్నారు మిల్కీ బ్యూటీ. ఇప్పటికే ఆమె చేసిన స్పెషల్ సాంగ్స్.. ఓ రేంజ్‌లో హిట్ అయ్యాయి. సోషల్ మీడియాలో ఇప్పటికీ ట్రెండింగ్‌లోనే ఉన్నాయి. సినిమా ఏదైనా స్పెషల్ సాంగ్ అంటే తమన్నానే చేయాలనేంతలా పాపులారిటీ సంపాదించుకుంది. ఏ సాంగ్ అయినా.. తన డ్యాన్స్ స్కిల్స్, ఎక్స్ప్రెషన్స్‌తో ఆడియన్స్‌ను కట్టిపడే టాలెంట్ ఆమె సొంతం. ఇప్పుడు ఆమె డ్యాన్స్ చేసిన ఓ సాంగ్ వీడియో సోషల్ మీడియాలో ఫుల్ వైరల్‌గా మారింది. రీసెంట్‌గా ఓ ఈవెంట్ లో తమన్నా.. పలు సాంగ్స్ తో మెప్పించారు. తన డ్యాన్స్‌తో ఓ రేంజ్‌లో సందడి చేశారని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. గ్రీన్ కలర్ మోడ్రన్ డ్రెస్‌లో హీట్ పుట్టించే లుక్స్‌తో.. తన ఎక్స్ప్రెషన్స్‌తో మైమరపించింది తమన్నా. ఎవర్ గ్రీన్ హిట్ సాంగ్ కజరారేకు అయితే అదరగొట్టేసిందని చెప్పాలి. మొత్తానికి తమన్నా వీడియోస్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. దీంతో నెటిజన్లు ఫుల్‌గా రెస్పాండ్ అవుతున్నారు.

దుమ్ముదులిపేశారని కామెంట్స్ పెడుతున్నారు. డ్యాన్స్ స్కిల్స్ సూపర్ అని.. ఎక్స్ప్రెషన్స్ వేరే లెవెల్ అని అనేక మంది నెటిజన్లు కొనియాడుతున్నారు. లైక్ కొట్టి వీడియోస్ ను ఇంకా వైరల్ చేస్తున్నారు. లుక్ అదిరిపోయిందని చెబుతున్నారు. ఏ సాంగ్ అయినా.. తమన్నా ఫ్లాట్ చేయడం పక్కా అని అంటున్నారు. మోస్ట్ టాలెంటెడ్ హీరోయిన్ అని తమన్నాను ఆకాశానికెత్తేస్తున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే.. బాలీవుడ్ రైడ్ సీక్వెల్‌లో స్పెషల్ సాంగ్‌తో సందడి చేయనున్నారు తమన్నా. రీసెంట్‌గా ఆ సాంగ్ ప్రోమో రిలీజ్ అవ్వగా.. సూపర్ రెస్పాన్స్ వచ్చింది. రేంజర్‌లో యాక్ట్ చేస్తున్న తమన్నా.. అమెజాన్ ప్రైమ్ వీడియో ప్రాజెక్ట్ డయరింగ్ పార్టనర్స్‌లో కనిపించనున్నారు. వీటితోపాటు మరికొన్ని ప్రాజెక్టులను లైన్ లో పెడుతున్నారు.

# స్పై విశ్వంలో కబీర్- టైగర్‌లకు సిసలైన పోటీ



ఇటీవలి కాలంలో స్పై యూనివర్శ్‌లు, మల్టీవర్శ్‌ల ట్రెండ్ కొనసాగుతోంది. సహజంగానే యూనివర్శ్ కాన్సెప్టుల్లోకి కొత్త పాత్రలు వచ్చి చేరుతుంటాయి. అలా వైఆర్ఎఫ్ ప్రతిష్ఠాత్మక స్పై యూనివర్శ్‌లోకి వచ్చి చేరాడు యంగ్ టైగర్ ఎన్టీఆర్. వార్ 2లో హృతిక్‌తో కలిసి నటించడం చారిత్రాత్మకం. దక్షిణ భారతదేశం నుంచి ఇలాంటి అవకాశం అందుకున్న మొట్టమొదటి హీరోగా ఎన్టీఆర్ చరిత్ర సృష్టిస్తున్నాడు. తారక్ ఎనర్జీ, డ్యాన్సింగ్ ఎబిలిటీ, గ్రేస్ ప్రతిదీ రాజమౌళి ఆర్.ఆర్.ఆర్ చిత్రంతో ప్రపంచం తెలుసుకుంది. అప్పటి నుంచి తారక్ దశ దిశ తిరిగిపోయింది. ఒక దక్షిణాది హీరోని ఎంపిక చేయడం ద్వారా ప్రఖ్యాత యష్ రాజ్ ఫిలింస్ అధినేత ఆదిత్య చోప్రా బిగ్ బెట్టింగ్‌కి ప్లాన్ చేసారు. దక్షిణాదిన క్రేజ్ ఉన్న హీరో కారణంగా ఈ బ్యానర్ తన ఇమేజ్‌ని పెంచుకోబోతోంది. తారక్‌ని విశ్వంలో భాగం చేయడం అనేది వ్యూహాత్మక నిర్ణయం. ఇది కేవలం ఏదో ఒక సినిమా వరకూ కొనసగే అనుబంధం అని భావించకూడదు. ఇందులో చాలా సినిమాలు తెరకెక్కనున్నాయి. స్పై వర్శ్‌లో కీలక పాత్రలైన కబీర్, టైగర్ వంటి వాటికి ధీటుగా ఇప్పుడు తారక్ పాత్రను కూడా పరిచయం చేస్తుండడం సర్వత్రా ఉత్కంఠను పెంచుతోంది. కబీర్ పాత్రలో హృతిక్ రోషన్, టైగర్ పాత్రలో సల్మాన్ ఖాన్ వంటి వారు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించారు. ఇప్పుడు దక్షిణాది నుంచి సుమారు 100 కోట్లు కొల్లగొట్టేందుకు యంగ్ టైగర్ సహాయపడతాడని వైఆర్ఎఫ్ స్కెచ్ వేసింది. ఈ వ్యూహం ఫలిస్తే స్పై వర్స్‌ల పేరుతో వరుసగా తారక్‌తో సినిమాలు తీసేందుకు ఆదిత్య చోప్రా హిడెన్ ప్లాన్ సిద్ధం చేసారని కూడా గుసగుస వినిపిస్తోంది. కొత్త ప్రతిభను పరిచయం చేయడం అంటే డబ్బును స్పిన్ చేయడం... నచ్చినట్టు దండుకోవడం అని వైఆర్ఎఫ్ నిరూపించబోతోంది. సల్మాన్‌తో టైగర్ ఫ్రాంఛైజీ, హృతిక్‌తో వార్ ఫ్రాంఛైజీని నడిపిస్తూ దీనిని యూనివర్శ్‌గా మలిచి ఇందులో కొత్త హీరోలను పరిచయం చేస్తూ వైఆర్ ఎఫ్ బిగ్ గేమ్ నడిపిస్తోంది. సమీప భవిష్యత్తులో ఈ విశ్వంలో స్వతంత్ర చిత్రాలు, స్పిన్-ఆఫ్‌లు, ప్రధాన క్రాస్ఓవర్‌లు ఉంటాయని అంచనా. స్పై వర్శ్‌లో మహిళా పాత్రలు జోయా (కత్రినా కైఫ్), రుబాయి (దీపికా పదుకొనే) తో పాటు ఆల్ఫాగా ఆలియా భట్ కూడా ఎంట్రీ ఇస్తోంది. వార్ 2తో ఎన్టీఆర్ బాలీవుడ్ కి పరిచయం అవుతున్నాడు.

ఇది అతడికి గ్రాండ్ ఎంట్రీ కాబోతోంది. టాలీవుడ్‌లో వేరొక హీరోకి సాధ్యపడని విధంగా తారక్ డెబ్యూ చేస్తుండడం సర్వత్రా ఉత్కంఠ పెంచుతోంది. వైఆర్ఎఫ్ అతడిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతాడని అభిమానులు బలంగా నమ్ముతున్నారు.


# నీకు అండగా ఉంటాను బాబాయ్, లవ్ యూ




బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ నటిస్తున్న 'భైరవం' సినిమా టాలీవుడ్‌లో భారీ బజ్ క్రియేట్ చేస్తోంది. విజయ్ కనకమేడల డైరెక్షన్‌లో, కెకె రాధామోహన్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ మే 30న విడుదల కానుంది. తమిళ హిట్ 'గరుడన్' రీమేక్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ ఈవెంట్ ఏలూరులో ఆదివారం గ్రాండ్‌గా జరిగింది. ఈ ఈవెంట్‌లో మంచు మనోజ్ భావోద్వేగ స్పీచ్ హైలైట్‌గా నిలిచింది, నారా రోహిత్ తన స్పందనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. 'భైరవం' సినిమాలో అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌లో ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామాతో అభిమానులను ఆకట్టుకుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం 'నాంది', 'ఉగ్రం' సినిమాలతో సత్తా చాటిన విజయ్ కనకమేడల డైరెక్షన్‌లో మరో హిట్ అవుతుందని అంచనాలు నెలకొన్నాయి. ఈ ఈవెంట్‌లో మనోజ్ తన కుటుంబ సమస్యలను ప్రస్తావిస్తూ ఎమోషనల్ అయ్యాడు. మనోజ్ మాట్లాడుతూ, "సొంత వాళ్లు దూరం పెట్టిన ఈ రోజుల్లో మీరు నన్ను దగ్గర చేసుకుని ఇంత ప్రేమను చూపిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఎన్నో జరిగాయి, ఎన్నో చూశాను. కట్టుబట్టలతో రోడ్డుపైకి తెచ్చారు" అని భావోద్వేగంగా అన్నాడు. తాను ఎప్పటికీ మోహన్ బాబు కుమారుడినేనని, కట్టె కాలే వరకు ఆయన కొడుకుగానే ఉంటానని చెప్పాడు. ఈ స్పీచ్ ఈవెంట్‌లో హైలైట్‌గా నిలిచింది, అభిమానులను కంటతడి పెట్టించింది. ఈ ఈవెంట్ తర్వాత నారా రోహిత్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. "ఏలూరులో 'భైరవం' ఈవెంట్ అద్భుతంగా జరిగింది. ఈవెంట్‌ను ప్రత్యేకం చేసిన ఏలూరు ప్రజలకు ధన్యవాదాలు. ఈ ఈవెంట్‌లో మనోజ్ బాబాయ్ స్పీచ్ హైలైట్, ఎంతో పవర్‌ఫుల్‌గా, భావోద్వేగంగా, హృదయాన్ని హత్తుకునేలా ఉంది. ఏది ఏమైనా నీకు అండగా ఉంటాను బాబాయ్, లవ్ యూ" అని రోహిత్ రాశాడు. రోహిత్ ఈవెంట్‌లో 'భైరవం' గురించి మాట్లాడుతూ, "ఈ సినిమా నా కెరీర్‌లో స్పెషల్. బెల్లంకొండ సురేశ్ ఈ కథను తీసుకొచ్చారు, విజయ్ కనకమేడల డైరెక్షన్‌తో నమ్మకం కలిగింది. సాయి, మనోజ్ నటిస్తున్నారని తెలిసి సంతోషించాను.

మనోజ్‌తో చిన్నప్పటి నుంచి సన్నిహిత అనుబంధం ఉంది, ఈ సినిమాతో మా బంధం మరింత బల పడింది" అని అన్నాడు. మొత్తంగా, 'భైరవం' ట్రైలర్ ఈవెంట్ అభిమానులకు ఎమోషనల్ ఎక్స్‌పీరియన్స్‌గా నిలిచింది. మనోజ్, రోహిత్ మధ్య అనుబంధం, ఈ సినిమా హైప్‌ను మరింత పెంచింది. మే 30న విడుదల కానున్న ఈ సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందో చూడాలి.

# వీరమల్లు ప్రచారం...ఓజీ షూటింగ్ ఒకేసారా?





హరిహరవీరమల్లు గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతుంది. జూన్ 12న చిత్రాన్ని పాన్ ఇండియాలో రిలీజ్ చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన పోర్షన్ షూటింగ్ కూడా పూర్తి చేయడంతో రిలీజ్ కన్ఫమ్ అయింది. మరి వీరమల్లు ప్రచారం సంగతేంటి? అంటే ప్రచారం బాధ్యత కూడా పవన్‌పై అంతే ఉంది. ఇది పాన్ ఇండియా సినిమా కాబట్టి ఉత్తరాదిన కూడా ప్రచారం చేయాలి. కేవలం తెలుగు రాష్ట్రాల ఈవెంట్లకు హాజరైతే సరిపోదు. మరి ఉత్తరాదిన ప్రచారం ఎలా ప్లాన్ చేస్తున్నారు? అంటే ఒక్కసారి ముంబై వెళ్తే రెండు పనులు అయ్యేలా ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఓజీ షూటింగ్‌లో భాగంగా పవన్ ఈ నెలఖరున ముంబై వెళ్తారు. హైదరాబాద్ షెడ్యూల్ అనంతరం అది జరుగుతుంది. ముంబైలో 15 రోజుల పాటు షూటింగ్ ఉంటుందని సమాచారం. ఈరోజులన్నింటిని ఓజీకే కేటాయించారు. అయితే ఇదే సమయంలో వీరమల్లు ప్రచారం కూడా ఉండేలా చూసుకోమని మేకర్స్‌ని కోరినట్లు వార్తలొస్తున్నాయి. ప్రచారానికి కేవలం రెండు..మూడు గంటలు కేటాయిస్తే సరిపోతుంది కాబట్టి ఇలా ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తుంది. పవన్‌కు ఉత్తరాదిన మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. సనాతన ధర్మ పరిరక్షకుడిగా ఆ మధ్య తిరుపతి పోరాటంతో బాగా ఫేమస్ అయ్యారు. నిరంతనం స్వామివారి మాలలోనే ఏడాది కాలంగా వైరల్ అవుతున్నారు. దీంతో పవన్ నార్త్ లో బాగా ఫేమస్ అయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీకి అత్యంత సన్ని హితుడిగా ఉండటం కూడా కలిసొస్తుంది. ఇవన్నీ వీరమల్లుకు కలిసొచ్చే అంశాలు. మొఘల సామ్రాజ్యంపై వీరమల్లు పోరాటం సినిమా కథ కావడం పవన్‌కు ఈ టైమ్‌లో బాగా కలిసొచ్చే అంశం. రాజకీయంగా వీరమల్లు కొంత ప్లస్ అవుతుంది. దేశంలో తాజాగా చోటు చేసుకున్న పరిణామాలు.. మతం అనే అంశంతో పవన్ బాగా ఫోకస్ అవుతున్నారు. అఖండ తర్వాత నటసింహ బాలకృష్ణ కూడా నార్త్‌లో బాగా ఫేమస్ అయ్యారు. అది పాన్ ఇండియా రిలీజ్ కాకపోయినా అఘోర పాత్రలో సంచలన మవ్వడంతోనే ఆ క్రేజ్ సాధ్యమైందన్నది తెలిసిందే.

# ప్రజానీకం తరుపున ప్రత్యేక ధన్యవాదాలు

**(రాజధాని వార్తలు):** మేయర్ కి మరియు కమిషనర్‌కి నమస్కరించి వ్రాయునది.. ఈ క్రింద తెలిపిన వర్క్స్ కోసం లెటర్స్ ఇవ్వడం జరిగింది. ఈ వర్క్స్ తొందర్లోనే మొదలు పెట్టే విధంగా చర్యలు తీసుకుంటానని గౌరవ మేయర్ తెలియజేయడం జరిగింది..వారికి మా వార్డు ప్రజానీకం తరుపున ప్రత్యేక ధన్యవాదాలు..1. మా వార్డులో ఉన్న సాయి బృందావన కాలనీ నందు రోడ్స్ మరియు కాలువలు నిర్మించవలసిందిగా కోరుచున్నాము, ఈ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు కాలువలు లేకపోవడం వలన వీళ్లు వాడిన వాడుకు నీరు బయటకు పోవడానికి వీలు లేకపోవడం వలన దోమలు పందులు మరియు పాముల వలన అనేక ఇబ్బందులు పడుతున్నారు కావున మా వార్డులో ఉన్న సాయి బృందావన్ కాలనీకి రోడ్స్ మరియు కాలవలను కట్టడానికి, మరియు మున్సిపాలిటీ కొళాయిలకి పైప్ లైన్స్ వేసి ప్రతి ఇంటింటికి కొళై కనెక్షన్స్ అనుమతులు ఇవ్వవలసిందిగా కోరుకుంటున్నాం..2. మా వార్డులో ఉన్న చాలా కాలువలు తాలూకా లెవెల్స్ సరిగా లేకపోవడం వల్ల కాలవల్లో ఉండే నీరు సరిగా వెళ్లకపోవడం వల్ల అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారు. కావున తమరు మా వార్డులో ఉన్న కాలువలను నూతనంగా నిర్మించి లెవెల్స్ కరెక్ట్‌గా ఉండే విధంగా కట్టించవలసిందిగా కోరుకుంటున్నాము. ఇరిగేషన్ కాలువలకు జీవీఎంసీ కాలువలను కలపడం వలన వాటిలో ఉన్న సిల్ట్ అన్ని వార్డుల నుండి వచ్చే కాలువల నీరు ఆఖరిగా నా వార్డులో ఉన్న కాలువల మీదుగా వెళ్ళటం వల్ల అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నాం. ఈ కాలువల్లో సిల్ట్ పూర్తిస్థాయిలో తీయించకపోవడం వల్ల నీరు సరిగ్గా వెళ్లకపోవడం వలన దోమలు విపరీతంగా పెరిగిపోయి డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. మా వార్డులో చాలా చోట్ల



కాలువలు లేకపోవడం వల్ల అక్కడ నివసిస్తున్న కుటుంబాలు చాలా చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కావున తమరు దయవుంచి మా వార్డులో నూతనంగా కాలవలను నిర్మించవలసిందిగా కోరుకుంటున్నాం. 3.మా వార్డులో అంబేద్కర్ నగర్ వద్ద అంబేద్కర్ కళ్యాణ మండపం శిథిలావస్థకి వచ్చింది. ఆ చుట్టుపక్కల ఉన్న ప్రజలందరూ ఈ కళ్యాణ మండపంలో అనేక కార్యక్రమాలు చేసుకోవడం జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు ఎందువల్ల అంటే కళ్యాణ మండపం పైనున్న స్లాబ్ తాలూకా పెచ్చులు రాలిపోవడం జరుగుతుంది. అలానే మొన్న ఎలక్షన్స్ లో రెండు పోలింగ్ బూతులు తాలూకా ఎలక్షన్స్ ని ఇందులో నిర్వహించడం జరుగుతుంది. కావున మా ఈ ప్రాంత వాసులకి అలాగే మన జీవీఎంసీ వారికి ఉపయోగపడే విధంగా దీనిని పునర్మించవలసిందిగా కోరుకుంటున్నాము. అలానే 30 ఏళ్ల క్రితం కట్టిన కమ్యూనిటీ హాల్ అవ్వటం వల్ల అప్పుడు ఒక ఫ్లోర్ మాత్రమే వేయడం జరిగింది. ఇప్పుడు రెండు ఫ్లోర్లు వేసి మా ప్రాంత ప్రజల తాలూకా ఫంక్షన్స్ చేసుకునే విధంగా పునర్ నిర్మించవలసిందిగా కోరుకుంటున్నాము. 4. మా వార్డులో ఉన్న రజకుల కాలనీలో కమ్యూనిటీ హాల్ శిథిలావస్థలో ఉన్నందున ఈ ప్రాంత వాసులు వాళ్ళ ఇంట్లో జరిగే శుభకార్యములకు చేసుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కమ్యూనిటీ హాల్ సుమారుగా 30 సంవత్సరముల క్రితం కట్టడం వలన అప్పట్లో ఒక ఫ్లోర్ మాత్రమే వేయడం జరిగింది. ఇప్పుడు జనాభా పెరుగుతున్న దానినిబట్టి అదే ప్లేస్‌లో రెండు ఫ్లోర్లు కమ్యూనిటీ హాల్‌ని నిర్మించాలని వారి ఇంట్లో జరిగే శుభకార్యములకు ఉపయోగపడే విధంగా నిర్మించాలని కోరుకుంటున్నాము. 5. గౌరీ కాలనీ నుండి తోటాడ రోడ్డు వరకు నిత్యం అనేకమంది ఈ మార్గం ద్వారా ప్రయాణించడం జరుగుతుంది అయితే బైపాస్ నుండి గౌరీ కాలనీ వరకు మాత్రమే రోడ్డు ఉండటంవల్ల మిగిలిన రోడ్డంతా గ్రావెల్ రోడ్డు అవటం వలన వర్షాకాలంలో ఆ ప్రాంతవాసులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కావున ఈ రోడ్డును నిర్మించవలసిందిగా కోరుకుంటున్నాము. 6. మా 80 వార్డులో ఉన్న ఎరుకువానిపాలెం గ్రామంలో బరియల్ గ్రౌండ్ కి కాంపౌండ్ వాల్ లేక సరైన రోడ్డు లేక మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కావున మా యందు దయ ఉంచి ఈ బరియల గ్రౌండ్‌కి కాంపౌండ్ వాల్‌ను మౌలిక వసతులను కల్పించవలసిందిగా కోరుకుంటున్నాము. గమనిక..(ఈ వర్క్ సుమారుగా ఆరు నెలలు క్రితం శాంక్షన్ అయింది కానీ ఇప్పటివరకు పనులు మొదలు పెట్టలేదు వెంటనే పనులు మొదలుపెట్టించవలసిందిగా కోరుకుంటున్నాను..) 7. మా వార్డులో కట్టిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కు చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో ఆగతాయిల తాకిడి ఎక్కివైపోవడం జరుగుతుంది. అలానే వాళ్ళు త్రాగేసిన మందు బాటిల్స్ ని పగలగొట్టేసి చిందర వందరగా తయారు చేయడం జరుగుతుంది. కావున మా యందు దయవుంచి మా వార్డులో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్కు కాంపౌండ్ వాల్ని నిర్మించవలసింది కోరుకుంటున్నాము. 8. అనకాపల్లిలో ఎంతో చరిత్ర కలిగిన దేవాలయం ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి దేవాలయం మా వార్డులో ఉంది. నిత్యం అనేక వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనార్థం రావడం జరుగుతుంది. ఈ అమ్మవారి గుడికి వచ్చే రోడ్డుకి ఇరువైపులా కాలువలు లేకపోవడం వల్ల వాడుకునే నీరు రోడ్లపై కొచ్చి ఆ నీటిలో నుంచే ఈ భక్తులు నడుచుకుంటూ అమ్మవారి దర్శనానికి వెళ్లడం జరుగుతుంది. ఈ రోడ్డులో చిన్నపాటి వర్షం పడిన నీరు నిల్వ ఉండిపోవడం వల్ల ఈ మార్గం మీదుగా ప్రయాణం చేస్తున్న వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కావున మా యందు దయవుంచి ఈ ప్రాంతంలో కాలువలని నిర్మించవలసిందిగా కోరుకుంటున్నాం. 9. మా వార్డులో ఉన్న విలీన గ్రామాల్లో సరైన రోడ్స్ లేక సరైన కాలువలు లేక మున్సిపాలిటీ పైప్ లైన్స్ లేక నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మా యందు దయఉంచి, మా విలీన గ్రామాల్లో ఉన్న వల్లూరు గొర్లివానిపాలెం రాజుపాలెం ఎరుకువానిపాలెంలలో రోడ్స్, డ్రయిన్స్ నిర్మించవలసిందిగా మరియు మున్సిపల్ వాటర్ పూర్తి స్థాయిలో అందే విధంగా చేయవలసిందిగా కోరుకుంటున్నాము.. 10. మా వార్డులో ఉన్న కర్రీ వారి వీధిలో నూతనంగా గృహములో నిర్మాణం జరిగినవి వాటికి సరైన రోడ్స్ మరియు కాలవలు లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దయవుంచి మాకు ఈ రోడ్స్‌ని మరియు కాలువలను ఏర్పాటు చేపించవలసిందిగా కోరుకుంటున్నాము.

# రోడ్డు ప్రమాదంలో బైక్ మెకానిక్ దుర్మరణం

## - మృతదేహం వద్ద బోరున విలపించిన కుమార్తెలు
## పెంటపాడు గ్రామాన్ని కమ్ముకున్న విషాదఛాయలు



**అల్లూరి జిల్లా,చింతపల్లి, (రాజధాని వార్తలు):** నర్సీపట్నం-చింతపల్లి జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పెంటపాడు గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ నల్లాల చంద్రావు (38) దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన రౌరింతాడ గ్రామ సమీపంలో మలుపు వద్ద చోటుచేసుకుంది. మృతదేహాన్ని గ్రామానికి తీసుకు రాగానే అక్కడ శోకసంద్రం అలముకుంది. చంద్రావుకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, వారు మృతదేహం వద్ద బోరున విలపించడంతో గ్రామస్తుల కళ్ళు చెమర్చాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో చేరుకుని అశ్రునివాళులు అర్పించారు. చంద్రావు నిత్యం బైక్ రిపేరింగ్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. సంఘటనా స్థలంలోనే అతను ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం. "ఇలాంటి ఘటన పగవాడికైనా జరగకూడదు," అంటూ పలువురు గ్రామస్తులు వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై చింతపల్లి, నర్సీపట్నం బైక్ యూనియన్ అధ్యక్షుడు మాకిరెడ్డి అప్పారావు, సభ్యులు, పలువురు గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఇద్దరు పిల్లల భవిష్యత్‌కు అండగా నిలవాలని వారు డిమాండ్ చేశారు.

# పేదల పోరాటమే సుందరయ్యకు నిజమైన నివాళి

## - సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నయ్య పడాల్



**అల్లూరి జిల్లా,చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి మండల కేంద్రంలో సోమవారం కార్మిక కర్షక దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో గొప్ప విప్లవకారుడు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్య పడాల్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చిన్నయ్య పడాల్, సుందరయ్య జీవితమంతా పేదల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం అంకితమై ఉన్నదని తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత పార్లమెంటులో మొట్ట మొదటి ప్రతిపక్ష నేతగా సైకిల్ పై పార్లమెంట్‌కు వెళ్లిన ఘనత ఆయనదని, ఈ త్యాగమూర్తి జీవితం నేటి యువతకు ఆదర్శమని అన్నారు. అలాగే మండల కేంద్రాల్లో స్థిరపడిన గిరిజనులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడు భూములపై సాగు చేస్తున్న గిరిజనులకు ఇప్పటికీ పట్టాలు మంజూరుకాని పరిస్థితి ఉందని, దీనిపై ప్రభుత్వాన్ని కదిలించేందుకు పెద్ద ఉద్యమానికి సిద్ధమవుతున్నట్టు తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 3 కు చట్టబద్ధత కల్పించేంతవరకు పోరాటం కొనసాగుతుందని చెప్పారు. 1/70 సంరక్షిత గిరిజన ప్రాంతాల్లో టూరిజం పేరుతో జరుగుతున్న భూదోపిడిని అడ్డుకునేందుకు కూడా సిపిఎం పార్టీ ఉద్యమించనున్నదని వివరించారు. ఏజెన్సీలో కార్పొరేట్ శక్తుల కన్ను పడిందని, అడవుల రక్షణకు గిరిజనులను ఐక్యంగా పోరాటానికి సిద్ధం చేయనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జికేవీ మండల నాయకుడు గడుతూరి సత్యనారాయణ, అప్పల నరస, సత్యవతి, భవాని, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం: హైవే పనులపై సమీక్ష

## - వాహనదారులు అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి : చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి మండలంలోని రౌరింతాడ వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం స్థానికులను తీవ్ర కలకలం కలిగించింది. ఈ ప్రమాదం నేపథ్యంలో వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా సూచించారు. విశాఖపట్నం వైపు వెళుతున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు రౌరింతాడ సమీపంలో ఓ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో పెంటపాడు గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ నల్లాల చంద్రరావు అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్య కృష్ణవేణి, అన్నయ్య కుమారుడు అఖిలేష్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం అనంతరం సంఘటన స్థలాన్ని ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా పరిశీలించి, వెంటనే చింతపల్లి సీఐ ఎం.వినోద్ బాబు, జాతీయ రహదారి నిర్మాణ సూపర్వైజర్ తిలక్‌లతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి పనులు సాగుతున్న నేపథ్యంలో, రహదారిపై భద్రతా చర్యలు పటిష్టంగా ఉండాలని అధికారులను ఆదేశించారు."ప్రమాదకరమైన మలుపులు, అనప్రమత్తత కారణంగా ప్రమాదాలు సంభవించే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, తగిన లైటింగ్ వంటివి ఏర్పాటు చేయాలి," అని ఏఎస్పీ పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని, రోడ్లు తడిసి వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయని ఆమె తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. మద్యం సేవించి వాహనం నడపకూడదు. ఒకే వాహనంలో ముగ్గురు ప్రయాణించడం, అతివేగంగా నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై సీసీ కెమెరాల ద్వారా గమనించి కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు.

# నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

## : జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి మండల స్థాయి అధికారులతో గ్రామ, వార్డు సచివాలయాల సర్వే, సంపదతయారీ కేంద్రాలు, డుమా, హౌసింగు, సూర్యఘర్, పంచాయతీ రాజ్ పనులు తదితర అంశాలపై వీడియా కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు, పూర్తిచేసిన లక్ష్యాలు వివరాలు శాఖల వారీగా, మండలాల వారీగా జిల్లా కలెక్టరు సమీక్ష చేసారు. వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను కలెక్టరు ఆదేశించారు. క్లోరినేషను చేసిన నీటిని మాత్రమే సరఫరా చేయాలని, క్లోరినేషను సక్రమంగా చేయాలని తెలిపారు. బోర్లు మరమ్మత్తులను వెంటనే చేయుటకు అవసరమైన విడిబాగాలు సిద్దంగా ఉంచుకోవాలని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు లక్ష్యం మేరకు పూర్తిచేయాలని తెలిపారు. గ్రామవార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వర్క్ ఫ్రం హోమ్, మన మిత్ర సేవలు, చిన్నపిల్లలకు ఆధార్ నమోదు, ఇ కెవైసీ వంటి సర్వేలను వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. జిల్లా పంచాయతీ శాఖకు సంబంధించి గ్రామాలలో ఆసెస్మెంటు ఆధార్ అనుసంధానం, పన్నులు వసూలు రెండురోజులలో పూర్తిచేయాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్యం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పంచాయతీలలో సంపద తయారీ కేంద్రాలను అన్నింటిని వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. ఉత్పత్తి చేసిన ఎరువులను విక్రయించిన వివరాలను సంబంధిత రిజిస్టరులలో నమోదుచేయాలని, సంపద తయారీ కేంద్రం పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచాలని, మొక్కలు నాటాలని, చుట్టూ ప్రహారీ లేదా ఫెన్సింగు ఏర్పాటుచేయాలని తెలిపారు. ఉపాధిహామీ పథకానికి



సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు పనిదినాలు పూర్తిచేయుటకు రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకొని పనులు కేటాయించాలని తెలిపారు. కనీస వేతనం పొందేవిధంగా పనులు చేపట్టాలన్నారు. ఫారం ఫాండ్స్, పశువుల నీటితొట్టెలు వెంటనే పూర్తిచేయాలని, నీటి తొట్టెలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఉద్యానశాఖ ద్వారా మొక్కలు నాటుటకు భూమిని గుర్తించాలని తెలిపారు. ఇండ్లనిర్మాణానికి కేటాయించిన పనిదినాలు లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. జిల్లాలో మంజూరైన 13687 ఇంటి నిర్మాణాలకుగాను ఇప్పటి వరకు 7482 పూర్తిచేయడం జరిగిందని మిలిగిన నిర్మాణాలను స్టేజివారీ పురోగతితో పూర్తి చేయాలని తెలిపారు. అదనపు సహాయం అందిస్తున్న 3115 ఇండ్లకు గాను 665 మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసారని, మిగిలిన లబ్దదారులు కూడా వెంటనే నిర్మాణాలు పూర్తిచేసుకొనేలా ప్రోత్సహించాలని తెలిపారు. పంచాయతీ రాజ్ కు సంబంధించి ఎన్ ఆర్ ఇ జి ఎస్ పనులకు ఆమోదం కొరకు ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టరు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సి.ఇ.ఒ. కె.రాజుకుమార్, జిల్లా పంచాయతీ అదికారి ఆర్. శిరీషారాణి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటరు జిల్లా కో ఆర్డినేటరు ఇ. నాగలక్ష్మి, పంచాయతీరాజ్ ఇఇ కె.వి.నాయుడు, గ్రామీణ నీటి సరఫరా జిల్లా ఇంజనీరింగు అధికారి ఎస్.ఎ.ఎస్. రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan